
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

శుక్రవారం 18 జూలై 2025





సభకు హాజరైన రైతులు



నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులోకి ఎడ్ల బండిపై వస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని, జంగా తదితరులు

లాభసాటి సాగే లక్ష్యం

- ఆధునిక వ్యవసాయంతో రైతులకు ఆదాయం
- అన్నదాతలకు ఉపయోగ పడేలా కిసాన్ మేళాలు
- నడికూడి మార్కెట్ యార్డులో ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి
- ఆకట్టుకున్న స్టాల్స్.. వ్యవసాయ పరికరాలపై ఆసక్తి చూపిన రైతులు

సాగులో సమస్యలు తీర్చేందుకు.. వ్యయసాయంగా మారిన వ్యవసాయాన్ని మార్చేందుకు.. ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులతో ఆదాయాలు ఆర్జించేలా.. రైతుల్లో అవగాహన పెంచేందుకు దాచేపల్లి మండలం నడికూడి మార్కెట్ యార్డులో గురువారం కిసాన్‌మేళా జరిగింది. జిల్లాలో తొలిసారిగా నిర్వహిం చిన కిసాన్‌మేళాకు పిడుగురాళ్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు హాజరయ్యారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్‌మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లు రైతులను ఆకట్టుకున్నాయి. ఆధునిక వ్యవసాయ పరికరాల ప్రదర్శనతో పాటు అవి వినియోగించే విధానం గురించి రైతులు తెలుసుకున్నారు. తక్కువ నీటితో పంటలపై పురుగుమందుల పిచికారి చేయటం వంటి నమూనాలు గురించి తెలుసుకునేందుకు రైతులు ఆసక్తి చూపారు. విత్తనాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి పసల బీమా యో జన, రైతు సాధికారిక సంస్థ, ప్రజా భాగస్వామ్య, ప్రకృతి వ్యవసాయం, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు, కలెక్టర్ అరుణ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు పరిశీ లించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన రైతులకు ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు.

వసతి.. దయనీయం

సంక్షేమం సమస్యల మయం

- అరకొర వసతులతో విద్యార్థుల ఇక్కట్లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో అద్దె భవనాల్లోనే సగం హాస్టళ్లు
- ప్రభుత్వ వసతిగృహాల్లోని సమస్యలపై హైకోర్టు ఆగ్రహం

ఇదేమి వసతి..

హాస్టళ్లలో విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు, పౌష్టికాహారం అందడం లేదు. బెడ్లు, బెడ్ షీట్లు, దిండ్లు కూడా లేవు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, బాత్ రూమ్‌లు లేవు. చాలాచోట్ల హాస్టల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రభుత్వ వసతి గృహాల్లో కంటే పిల్లలు తల్లిదండ్రులు వద్ద ఉండడమే మేలు.

-హైకోర్టు ధర్మాసనం

చిలకలూరిపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువు కుంటున్న విద్యార్థులకు సంరక్షణతో కూడిన ఆశ్రయం ఇవ్వాల్సిన సంక్షేమ వసతిగృహాలు దా రుణంగా ఉంటున్నాయి. కనీస సౌకర్యాలు లేని శిథిల భవనాల్లో.. అపరిశుభ్ర వాతావరణంలో వి ద్యార్థులు వసతి పొందాల్సి వస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని జిల్లా కేం ద్రాలతో పాటు నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఉన్న హాస్టళ్ల సమస్యల వలయంలో ఉన్నాయి. హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో జిల్లా న్యాయసే వాధికార సంస్థలు పలు హాస్టళ్లను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలు, విద్యార్థుల అవస్థ లపై నివేదిక సమర్పించాయి. ఈ పరిస్థితుల్లో హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల అవస్థ లు తీర్చడంపై పాలకులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నా రు. ప్రభుత్వం ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నా సంక్షేమ వసతిగృహాల్లో పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శా ఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 70కి పైగా హాస్టళ్లలో పదివేల మం దికి పైగా విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. అయితే వీటిలో సగం అద్దె భవనాల్లోనే ఉన్నాయి. గుంటూరు సహా తెనాలి, వినుకొండ, బాపట్ల, మంగళగిరి, మాచర్ల, సత్తెనపల్లి (మిగతా 6లో)



గుంటూరులో ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న హాస్టల్

ఇళ్ల వద్దకే తపాలా సేవలు

22 నుంచి వినియోగదారులకు అందుబాటులోకి

నరసరావుపేట లీగల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వినియో గదారులకు ఇళ్ల వద్దే తపాలా సేవలు అందుబాట్లోకి తెస్తు న్నట్లు నరసరావుపేట తపాలాశాఖ రీజనల్ సూపరింటెం డెంట్ జాఫర్‌సాదిక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సేవలు అం దిస్తామన్నారు. సేవల్లో సామర్థ్యం పెంపు, సెల్‌ఫోన్ ద్వారా ఆర్థిక, బీమా, బ్యాంకింగ్ లావాదేవీల నిర్వహణతో పాటు మెరుగైన ట్రాకింగ్‌తో వినియోగదారులకు సేవలు అందిస్తా మన్నారు. డివిజన్ పరిధిలోని 449 తపాలా కార్యాలయాల్లో ఈ విధానం అమలవుతుందన్నారు. నూతన సంస్కరణల్లో భాగంగా ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు తపాలా కార్యాలయాల్లో సేవల్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 22 నుంచి తపాలా కార్యాలయాల్లో సేవలు పునః ప్రారంభమవుతాయన్నారు.

గురజాల, మాచర్ల, చిలకలూరిపేట ఏఎంసీ చైర్మన్ల నియామకం

6

ముగిసిన ఐసెట్

19న ఫలితాల విడుదల.. 21న కౌన్సెలింగ్

8

ఎన్టీఆర్ ఆదర్శప్రాయుడు

- వేటపాలెంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణలో హోంమంత్రి అనిత

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు.. నేడు గ్రీవెన్స్

పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహణ

నరసరావుపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ డే ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు గురువారం తెలిపారు. స్థానిక కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. ప్రతి నెల మూడో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించి, నిర్దీత సమయంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

బదిలీలు... మళ్లీమళ్లీ

వ్యవసాయ శాఖలో వింత పోకడ

నరసరావుపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖలో అధికా రుల బదిలీల్లో మళ్లీ మార్పులు చేశారు. ఇటీవల బదిలీ చేసిన అధికారులను, మళ్లీ ఆయా స్థానాల నుంచి బదిలీ చేయడం గమనార్హం. గత నెల 9న జరిగిన బదిలీల్లో వినుకొండ ఏడీఏ రవిబాబును పల్నాడు డీఏడీగా బదిలీ చేశారు. ఆయనను తిరిగి డీఏడీ నుంచి సత్తెనపల్లి ఏడీఏగా బదిలీ చేస్తూ గురువారం వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నరసరావుపేట రూరల్ ఏడీఏ పీ మస్తానమ్మను సత్తెనపల్లి ఏడీగా బదిలీ చేశారు. వెంటనే ఆమెను సత్తెనపల్లి నుంచి క్రోసూరు ఏడీఏగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఏడీఏ సీహెచ్ రమాదేవిని క్రోసూరు ఏడీఏగా బదిలీ చేశారు. ఆమెను క్రోసూరు నుంచి ఏడీఏ డీఆర్‌సీకి బదిలీ చేశారు. క్రోసూరు ఏడీఏ వీ హనుమంతరావును ఏడీఏ డీఆర్‌సీ బాపట్లకు బదిలీ చేయగా ఆయనను మళ్లీ పల్నాడు డీఏవోగా బదిలీ చేశారు. వ్యవసాయ శాఖలో 38 రోజుల క్రితం బదిలీ చేసిన అధికారులు మళ్లీ బదిలీ చేయడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బంగారు కుటుంబాల్లో... అనర్హులు

- జాబితాలపై పునఃపరిశీలన
- 20 శాతం వరకు అనర్హులు అని అంచనా

పల్నాడు జిల్లాలో 63,912 బంగారు కుటుంబాలను గుర్తించారు. వీరిలో 20 శాతం వరకు అనర్హులు ఉన్నట్టు ప్రాథ మికంగా అంచనా వేశారు. క్షేత్రస్థాయిలో వార్డు.. గ్రామ సభల ద్వారా సదరు జాబితాలను వెల్లడించి వారికి అర్హత ఉందా లేదా అన్న అంశంపై ప్రజాభిప్రాయం స్వీకరించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం బంగారు కుటుంబాల తుది జాబితాను ప్రకటించనున్నట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)



పేదరికమే లేని సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వ, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్‌షిప్(పీ4) అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా అమలు చేస్తోంది. పీ4కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. సంపన్న కుటుంబాలు సమాజంలో అట్టడుగున్న ఉన్న కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. జిల్లాలో గుర్తిం చిన బంగారు కుటుంబాల్లో అనర్హులు ఉన్నట్టు ప్రచారం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఎంపిక చేసిన బంగారు కుటుంబాల జాబితాలను పునఃపరిశీలన చేయాల ని ప్రభుత్వం ఆదేశించింది. సచివాలయ కార్యదర్శులు పీ4 సర్వే చేశారు. వారి కుటుంబాల గుర్తింపుకు టార్గెట్‌లు ఇవ్వడంతో వారు హడావుడిగా సర్వేను పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో అనర్హులను కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చారు. ఈ నేపథ్యంలో రీ సర్వే నిర్వహించను న్నారు. వార్డు.. గ్రామస్థాయిలో బంగారు కుటుంబాల జాబితాను ప్రకటించి అర్హతపై ప్రజా భిప్రాయం స్వీకరించ నున్నారు. ఇందుకు సంబం ధించి రీసర్వేకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. పట్టణాల్లో అనర్హులు వందల సంఖ్య లోనే ఉన్నట్టు సమాచారం. నరసరావుపేట నియోజక వర్గంలో 8,111 బంగారు కుటుంబాలను గుర్తించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో 9,818, గురజాల 8,439,మాచర్ల 10,394, పెద కూరపాడు 9,214, సత్తెనపల్లి 8,085, వినుకొండ నియోజకవర్గంలో 9,850 కుటుంబాలు ఉన్నాయి. గ్రామ.. వార్డు స్థాయిలో జాబితాలను సిద్ధం చేసి రీ సర్వేకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది.

సలహా మండలి.. ఊసేది?

- సమావేశంపై స్పందించని యంత్రాంగం
- ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలైనా నిర్లక్ష్యం
- తొలిఅడుగు కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు బిజీ
- రైతులకు అత్యవసరమైనా పట్టించుకోని అధికారులు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు అవుతోంది. ఒకవైపు వరుణుడి కరుణలేదు. మరోవైపు సాగు సందిగ్ధంగా మారింది. ఈ పరిస్థితుల్లో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఖరీఫ్ ఆరంభంలోనే సాగునీటి సలహామండలి సమా వేశం నిర్వహించి జిల్లాలోని 4.48 లక్షల మంది రైతుల ప్రయోజనాలను కా పాడాలి. అయితే రెండు నెలలుగా ప్రజాప్రతినిధులు, అధికారులు సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహణ గురించే పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాల్లో ఉన్నారు. ఇక అధికారులు సమావేశ నిర్వహణ గురించి ప్రయత్నించడంలేదు. ఖరీఫ్ ఆరంభంలోనే సమావేశం నిర్వహించి పంటల సాగు, నీటి సరఫరాపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా నేటి వరకు ఆ ఊసేలే దు. పంటల సాగుకు అత్యంత కీలక సమావేశం నిర్వహించకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అంతటా వర్షాభావం నెలకొంది. ఈ నెలాఖరులోపు వర్షాలు కురవకపోతే పత్తికి ప్రత్యామ్నాయ పంటలు సూచించాలి. గత ఏడాది వరి విత్తనం కొరతతో అన్నదాతలు ఇక్కట్లు పడ్డారు. ఈ పరిస్థితుల్లో గత ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న సమస్యలను గుర్తించి సమీక్షించడంతో పాటు, ఈ ఖరీఫ్‌లో ఆ సమస్యలు పునరావృతం కాకుండా నిర్ణయాలు తీసుకోవాలి. సాగునీటి సరఫరా, కాల్వల మరమ్మతులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, భూసార పరీక్షలు, ఈ-క్రాప్ నమోదు వంటి వ్యవసాయనికి సంబంధించిన ప్రతి అంశంపై సమావేశంలో చర్చించాలి. సాగర్ జలాశయంలో నీటి లభ్యత, డ్యాం నుంచి సాగునీటి విడుదల అంశాలపై సమీక్షించాలి. సాగు నీటి విడుదల తేదీని కూడా ప్రకటించాలి. అయితే ఇంతటి కీలక సమావేశం నిర్వహణలో జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రాజెక్టు కమిటీ, సాగు నీటి సంఘాల ప్రతినిధులు సాగుకు సంబంధించిన అన్ని శాఖల జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొని సాగు ప్రణాళికపై చర్చించాల్సి ఉంది. జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ మాట్లాడుతూ రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఉత్తమ బోధన అందించాలి

- ప్రధానోపాధ్యాయుల శిక్షణలో డీఈవో

శావల్యాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యా యులు, తోటి ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి ప్రభుత్వ పాఠశాల లను బలోపేతం చేయాలని డీఈవో చంద్రకళ తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు నాయకత్వంపై శిక్షణా కార్యక్రమం మండలంలోని కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠ శాలలో ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ ముగింపు గురువారం జ రిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు అత్యుత్తమ బోధనతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెం చాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా చద వడం, రాయడంలో ప్రావీణ్యం పొందేలా, గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేసేలా 1, 2 తరగతుల వి ద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల చేతిరాత ను అభివృద్ధి చేసేందుకు వారిచే ప్రతిరోజూ రెండు పేరాలు రాయించాలన్నారు. అనంతరం కుప్పంలోని ద్రవిడియన్ యూనివర్సిటీలో జరిగిన రెండురోజుల వర్క్‌షాపులో జిల్లా తరపున పాల్గొన్న చేతిరాత నిపుణులు, బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ కో-ఆర్డినేటర్ రమేష్‌ను డీఈవో అభినందించారు. కార్యక్రమంలో డీవైఈవో సుభాని, ఎంఈవో లలితకుమారి, ఏఎంవో పూర్ణచంద్రరావు, ఎస్టీఏ రాష్ట్ర అదనపు కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చేతిరాత నిపుణులు రమేష్‌ను అభినందిస్తున్న డీఈవో చంద్రకళ

పంచాయతీ నిధులు గోల్‌మాల్

చింతపల్లి సర్పంచ్ సంతకం లేకుండా కార్యదర్శి డ్రా

కారంపూడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లి గ్రామ కార్యదర్శి రామరాజు సర్పంచ్ సంతకం లేకుండా రూ.3 లక్షలు నిధులు విత్ డ్రా చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిధులు దుర్వినియోగ మయ్యాయని తెలుసుకున్న సర్పంచ్ మాధవి ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తనకేమీ తెలియ దని, పెద్దలు డ్రా చేయమన్నారు.. తాను చేశానంటూ కార్యదర్శి తెలిపారు. అయితే ఆ పెద్దలు పేర్లు మాత్రం ఆ కార్యదర్శి చెప్పడం లేదు. నిధులను రెండు రోజుల క్రితం పంచాయతీ అకౌంట్లో చలానా ద్వారా జమ చేశా నని చెప్తున్నారు. కాగా ఒకసారి పంచాయతీ ఖాతా నుంచి విత్‌డ్రా చేసిన సొమ్మును మళ్లీ అదే అకౌంట్‌లో జమ చేయడానికి అవకాశం లేదని ఎంపీడీవో తెలిపారు. నిధుల విత్‌డ్రా, అనవసర ఖర్చులపై డీపీవోకు ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారుల విచారణ అనంతరం చ ర్యలు తీసుకుంటామన్నారు.

జనగణనతోనే కులగణన చేపట్టాలి


బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న శంకరరావు

తెనాలి అర్బన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జనగణనతోనే కులగణన కూడా చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ ఎంపీ పి.సత్యనారాయణ సమక్షంలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్‌కు వినతి పత్రం అందజేసినట్లు గురువారం తెలిపారు. అనాదిగా అన్యాయానికి, దోపిడికి గురవుతున్న ఓబీసీల సాధికారతకు కేంద్రానికి సిఫారసు చేయాలని కోరారు. మహిళ రిజర్వేషన్ చట్టానికి సవరణ చేయాలని. ప్రైవేట్ రంగంలో కూడా ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేంద్రంలో ఏర్పాటు చేసి ఓబీసీ ప్లాన్ రూపొందించి నిధులు కేటాయించాలన్నారు. క్రిమిలేయర్ తొలగించి ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వాలని, ప్రత్యేక రక్షణ చట్టం చేయాలన్నారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు క్రాంతికుమార్, కేసన కోటేశ్వరరావు, విష్ణు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు..

రూ.58.27లక్షల ప్రాజెక్ట్ మంజూరు


ప్రాజెక్ట్ పత్రం అందజేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య) జూలై 17 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బయో టెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆర్.చరణ్ రాజకు న్యూఢిల్లీలో ఏఎన్ఆర్ఎఫ్, పీఎం ఈసీఆర్‌జీ (అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, ప్రైమ్ మినిస్టర్స్ ఎర్లీ కెరియర్ రీసెర్చ్ గ్రాంట్) నుంచి రూ.58.27 లక్షల ప్రాజెక్టు మంజూరైందని వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. " స్టడీ ఆఫ్ యాంటీ లీష్మానియల్ యాక్టివిటీ ఆఫ్ బయోయాక్టివ్ కాంపౌండ్స్ ఐసోలేటెడ్ ఫ్రమ్ సీడ్స్ ఆఫ్ కారికా పపాయా అగెన్స్ట్ లీష్మానియా డోనోవాని" అనే అంశంపై పరిశోధనకు గాను రాబోయే మూడేళ్లకు ప్రాజెక్ట్ గ్రాంటు మంజూరైందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆర్. చరణ్ రాజను విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు అభినందించారు.

20న 'ఔషధ నిరోధకత'పై సదస్సు

- తెలుగు రాష్ట్రాల నుంచి 700 మంది వైద్యుల రాక
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్ వెల్లడి


సీఎంఈ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నందకిషోర్, కల్యాణ్ చక్రవర్తి

గుంటూరు మెడికల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఔషధ నిరోధకత (యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్/ ఏఎంఆర్) తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా రూపు దాలుస్తోందని, దీనిపై తగిన నియంత్రణ చర్యలు చేపట్టకపోతే ఇది మరో కరోనా మహమ్మారిలా మారుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఐఎంఏ హాల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాంటీ బయోటిక్ ఔషధ నిరోధకతపై వైద్యుల్లో మరింత అవగాహన పెంచేందుకు ఐఎంఏ రాష్ట్ర శాఖ, క్లినికల్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ (సిడ్స్) సంయుక్త ఆధ్వర్యంలో జూలై 20న గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి నిరంతర వైద్య విద్య కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సదస్సులో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 700 మంది వైద్యులు హాజరవుతున్నారని తెలిపారు. సిడ్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ సీఎంఈ కార్యక్రమంలో మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై వివిధ అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పేరుగడించిన వైద్య నిపుణులు సునీత నర్రెడ్డి, విష్ణురావు, సుమితారాయ్, లక్ష్మీ వేము, విజయ్ ఎలదండి, అనూప్ వారియర్, హరిప్రియా రెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. ఐఎంఏ గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, డాక్టర్ టి.సేవకుమార్, డాక్టర్ నీరెన్ ఆర్, డాక్టర్ డి.అమరలింగేశ్వరరావు, డాక్టర్ బి.సాయికృష్ణ సీఎంఈ పోస్టర్లను ఆవిష్కరించారు.

ఎన్టీఆర్ ఆదర్శప్రాయుడు


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి అభివాదం చేస్తున్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి

- చుండూరు మండలం వేటపాలెంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ
- రాష్ట్ర హోంమంత్రి అనిత

కొల్లూరు, చుండూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు అందరికి ఆదర్శ ప్రాయుడని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. గురువారం బాపట్ల జిల్లా చుండూరు మండలంలో పెనుగుదురుపాడు గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం వేటపాలెం గ్రామంలో టీడీపీ నాయకులు రావూరి కృష్ణ ప్రసాద్ (బాబు) ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహాన్ని హోంమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం నాడు ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, అప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధికి, పేద వారి సంక్షేమం కోసం ఎన్టీఆర్ చూపిన మార్గంలో చంద్రబాబు నడుస్తున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలంలో వ్యవస్థలను గాడిలో పెట్టి మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలోకి తీసుకు వెళ్లడంతో పాటు ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాటు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మలినేని'లో డిప్లమా తరగతులు ప్రారంభం


మాట్లాడుతున్న డీన్ డాక్టర్ రమేష్ బాబు

వట్టిచెరుకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లమా తరగతులు గురువారం ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ తమ కళాశాలపై పూర్తి విశ్వాసంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్చేందుకు ముందుకు రావడం తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల నిరంతర కృషి ఉంటుందన్నారు. కళాశాల డీన్ డాక్టర్ పి.రమేష్ బాబు మాట్లాడుతూ టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో డిప్లమా స్థాయి నుంచి సబ్జెక్ట్ నేర్చు కోవడం ద్వారా బీటెక్ విద్య చాలా సులభతరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, హెచ్‌వోడీ డాక్టర్ ఏఎస్‌కే చైతన్య, ఇన్‌చార్జ్ రవీంద్ర పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ఉద్యోగాలంటూ వసూళ్లు


వేళాంగిణి రాజు అరెస్టు చూపుతున్న ఎస్ఐ వెంకట్

మంగళగిరి సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ కేసు వివరాలను గురువారం మీడియాకు వెల్లడించారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన అంబటి వేళాంగిణి రాజు, భార్య అంబటి అనూష, వారి మేనల్లుడు అభి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి సుమారు రూ.12 లక్షలు వసూలు చేశారు. డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న మంగళగిరి పట్టణానికి చెందిన మిరియాల త్రినాథ్‌కు అనూషతో పరిచయం ఏర్పడింది. ఎయిమ్స్‌లో పనిచేస్తున్న అనూష తన భర్త వేళాంగిణి రాజు ఎయిమ్స్‌లోనే హెచ్‌ఆర్ మేనేజరుగా పనిచేస్తున్నాడని, రూ.2 లక్షలు చెల్లిస్తే హాస్పిటల్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికింది. ఆమె మాటలను పూర్తిగా నమ్మిన త్రినాథ్ తనతోపాటు తన స్నేహితుల ద్వారా కూడా రూ.2 లక్షల చొప్పున ఇప్పించాడు. ముగ్గురు నిందితులు వారికి నకిలీ నియామక పత్రాలు ఇచ్చారు. కొద్ది రోజులకు తాము మోసపోయామని గ్రహించిన బాధితులు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే. నిందితులు దాటవేస్తూ వచ్చారు. గట్టిగా ప్రశ్నిస్తే అట్రాసిటీ కేసు పెడతామని నిందితులు బెదిరించారని చెప్పారు. దీంతో బాధితుడు త్రినాథ్ మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రధాన నిందితుడైన వేళాంగిణి రాజును గురువారం అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు. అనూష, అభి పరారీలో ఉన్నారని చెప్పారు.

నలుగురు ఏడీఏలకు పోస్టింగ్

గుంటూరు సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో 40 రోజులుగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఏడీఏ (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)లపై రాష్ట్ర అధికారులకు ఎట్టకేలకు కనికరం కలిగింది. పోస్టింగ్ కోసం ఏడీఏల ఎదురు చూపు అనే శీర్షిక ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏడీఏ బోయపాటి రవి బాబును సత్తెనపల్లికి, ఏడీఏ మస్తానమ్మను క్రోసూరుకు, ఏడీఏ రమాదేవికి బాపట్ల శిక్షణా కేంద్రంలో పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటివరకు క్రోసూరులో పనిచేసిన హనుమంతురావును పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి బదిలీ చేశారు.

56 పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- మిగిలిన పాఠశాలలకు త్వరలో సర్దుబాటు

గుంటూరు (విద్య) జూలై 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని కొన్ని మండలాల్లో మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులను నియమిస్తూ డీఈఓ సీవీ రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రజ్యోతిలో గురువారం మూత బడిలు అనే శీర్షిక ఉపాధ్యాయుల కొరతపై ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. కొరత ఉన్న పాఠశాలల్లో 56 మంది మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. వెల్దుర్తి, బొల్లాపల్లి, వినుకొండ, కారంపూడి తదితర ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు వెంటనే ఉపాధ్యాయులు విధుల్లో చేరాలని డీఈఓ స్పష్టం చేశారు. వెల్దుర్తిలోని కొన్ని పాఠశాలల్లో అసిస్ట్ ఆధ్వర్యంలో విద్యా వాలంటీర్లను నియమించినట్లు ఎంఈఓ ఎస్కే ఎండీ కాశీం వెల్లడించారు. గురువారం ఆయన మండలంలోని కొన్ని పాఠశాలల్లో విస్తృత తనిఖీలు చేశారు.

సామాజిక మాధ్యమాలపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణ భరత గుప్తా

గుంటూరు (విద్య) జులై 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ స్థాయిలో విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై అవగాహన ఉండాలని కళాశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత గుప్తా సూచించారు. సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాలలో జోన్ 3 డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్, విద్యార్థులకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అయన పాల్గొని, మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ వంటి మాధ్యమాలు కలిగి ఉండటం ద్వారా విశ్వజనీన విజ్ఞానం తెలుసుకోవడంతో పాటు తమ ఆలోచనలు, జ్ఞానాన్ని స్నేహితులతో పంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆర్ జ్యోత్స్న కుమారి, ఆర్జెడి డాక్టర్ పి.కళావతి, కాలేజీ ఎడ్యుకేషన్ అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి మస్తానమ్మ, ఓఎస్డీ డాక్టర్ ఏవి కవిత, అనంతపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మశ్రీ, వేర్ ఇస్ ఆగ్రో లిమిటెడ్ డిప్యూటీ డైరెక్టర్ జయ ప్రదీప్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సిహెచ్ తులసి, బ్లాక్ బక్స్ సీఈవో టి.అనురాధ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.అపర్ణ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల బెనిఫిషరీ నగదు తిరిగి ఇవ్వాలి

- జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి


జోసెఫ్ మోసిగంటి

పొన్నూరు టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చర్చిల మరమ్మతుల కోసం గతంలో పాస్టర్లు చెల్లించిన బెనిఫిషరీ నగదును ప్రభుత్వం తిరిగి చెల్లించాలని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి గురువారం కోరారు. 2018లో తూర్పు గోదావరి జిల్లాలో చర్చిల మరమ్మతుల కోసం ఒక్కో చర్చికి రూ.3 లక్షల చొప్పున 30 చర్చిలకు రూ.90 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బెనిఫిషరీ కాంట్రిబ్యూషన్ కింద 10 శాతం నగదును ప్రతి చర్చి నుంచి పాస్టర్లు రూ.30వేల చొప్పున ప్రభుత్వానికి మొత్తం రూ.9 లక్షలు చెల్లించారని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి చర్చిల మరమ్మతులకు కాంట్రిబ్యూటరీ నగదును చెల్లించినట్లు చెపాపరు. అప్పట్లో ఎన్నికల దృష్ట్యా వైసీపీ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో చర్చిలకు ప్రభుత్వ నగదు చెల్లింపు ప్రక్రియ నిలిపివేశారని గుర్తుచేశారు. వైసీపీ వచ్చిన తరువాత ఈ సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి ఎంత అన్యాయం చేసినప్పటికీ క్రైస్తవ సమాజం సొంత మనిషిగా అనుకోవడంలో అర్థం లేదన్నారు. జగన్ ప్రభుత్వంతో పోలిస్తే చంద్రబాబు పాలనలో క్రైస్తవ సమాజానికి మేలు జరిగిందన్నారు. పాస్టర్లు అప్పు చేసి చెల్లించిన కంట్రిబ్యూషన్ నగదు తిరిగి ఇప్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వసతి.. దయనీయం

(5వ పేజీ తరువాయి)

నరసరావుపేట తదితర ప్రాంతాల్లో కళాశాల, పాఠశాల స్థాయి హాస్టళ్లు అద్దెభవనాల్లోనే ఉన్నాయి. అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉన్నా హాస్టళ్ల పర్యవేక్షణ సక్రమంగా సాగడం లేదు. కొంతమంది వార్డెన్లు వెల్ఫేర్ ఆఫీసర్లను మేనేజ్ చేసి విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా విద్యార్థుల సంక్షేమం గాలిలో దీపం అన్న చందంగా మారింది. అద్దె భవనాల్లో విద్యార్థులకు సరిపడినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు వారికి ఇవ్వాల్సిన దుప్పట్లు కూడా సకాలంలో అందడం లేదు. ఏటా చలికాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైద్య పరీక్షలు మరిచారు..

హాస్టళ్లలో వసతి పొందే విద్యార్థులకు కనీసం మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాల్సిన వైద్య పరీక్షలు గత కొన్నేళ్లలో జరిగిన దాఖలాలు లేవు. ఫలితంగా విద్యార్థులు చర్మ సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు కలుషిత నీరు ఆహారం తీసుకుని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా పట్టించుకోవడం లేదు.

కాస్మోటిక్ చార్జీల కోసం ఎదురుచూపు

హాస్టళ్లలో విద్యార్థులకు ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలి. అయితే ఇవి సక్రమంగా అందడం లేదు. కొంతంగా సబ్బులు నూనెలు తదితర వస్తువులు సొంత డబ్బులతోనే కొనుగోలు చేసుకుంటున్నారు.

తూతు మంత్రంగా మెనూ

విద్యార్థులకు నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. ఫలితంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందని ద్రాక్షలాగా మారింది. గుంటూరులోని కొన్ని హాస్టళ్ల విద్యార్థులు సమీపంలోని అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరికొందరు రైస్ కుక్కర్లను ఇళ్ల నుంచి తెచ్చుకొని హాస్టల్ గదుల్లోనే వంట చేసుకుంటున్నారు. ఇదంతా ఉన్నత స్థాయిలో అధికారులకు తెలిసిన చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

పిడుగుపాటుకు వృద్ధుడి మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పిడుగు పాటుకు వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఓలేరు శివారు గ్రామం వెంకటరాజు నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. గుంటూరు లూర్దు మరియన్న (69) మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో దగ్గరలో ఉన్న వేప చెట్టు కింద తలదాచుకున్నాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వోలకు తెలియజేశారు.

దెబ్బతిన్న భవనం

వేమూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) జంపని గ్రామంలో పిడుగుపాటుకు భవనం దెబ్బతింది. ముస్లింపేటలోని షేక్ ఖాదర్‌వలి ఇంటిపై పిడుగు పడ్డది. భవనం పిట్టగోడలు, శ్లాబు కొంత భాగం వరకు దెబ్బతిన్నాయి. ఎలాంటి ప్రమాదం జరగలేదు.

36,922 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 35,268 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 36,922 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,521 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర	వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13400	334	9500	12800
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	---	----
4884	---	----	341	10000	13800
సూపర్ 10	10000	13000	4884	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	----	---	బ్యాడిగి	10000	12700
బ్యాడిగి	10000	12300	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4500	7000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

పలు మార్కెట్ కమిటీలకు చైర్మన్ల నియామకం


బెల్లంకొండ భారతి, మల్లీశ్వరి దంపతులు, షేక్ కరిముల్లా

దాచేపల్లి/మాచర్లటౌన్/చిలకలూరిపేట జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పలు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లను గురువారం ప్రకటించింది. అందులో పల్నాడు జిల్లాలోని గురజాల, మాచర్ల, చిలకలూరిపేట మార్కెట్ యార్డులు ఉన్నాయి. గురజాల వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా దాచేపల్లి నగర పంచాయతీకి చెందిన బెల్లంకొండ భారతి నియామకమయ్యారు. బెల్లంకొండ భారతి 2012లో దాచేపల్లి పంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆమె భర్త బద్రి మండల టీడీపీ కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

● మాచర్ల మార్కెట్‌యార్డు చైర్ పర్సన్‌గా వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు రాజబోయిన మల్లీశ్వరిని ప్రభుత్వం నియమించింది. యాదవ సామాజిక వర్గానికి చెందిన రాజబోయిన మధుసూదన్ యాదవ్ వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి రాజబోయిన కుటుంబం ఆ పార్టీలో కొనసాగుతోంది. ఆయన భార్య మల్లీశ్వరికి పదవి ఇవ్వడంతో.. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు కృతజ్ఞతలు తెలిపారు.

● చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా ఎంపికయ్యారు. స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అనుచరుడుగా ఆయన కొనసాగుతున్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు


ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ అరుణ్ బాబు

ఆధునిక యంత్రాల ఎగ్జిబిషన్

● రైతులను ఆకట్టుకున్న స్టాల్స్
● ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు
● మరో నాలుగు రోజులపాటు స్టాల్స్‌ను కొనసాగించాలన్న కలెక్టర్, ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని
● రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కిసాన్ మేళా
● ఆరువేల మందికి పైగా రైతులు హాజరు
● తిరునాళ్ళను తలపించిన కిసాన్‌మేళా


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే యరపతినేని, మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, కలెక్టర్ అరుణ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా

దాచేపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆధునిక వ్యవసాయ పరికరాల ఏర్పాట్లు, వాడే విధానం, పురుగుమందులను తక్కువ నీటితో పంటలపై పిచికారి చేయటం వంటి నమూనాలతో ఏర్పాటుచేసిన స్టాల్స్ రైతులను ఆకట్టుకున్నాయి. గురువారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఏర్పాటుచేసిన కిసాన్‌మేళాతో వందకు పైగా స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. దీనిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ శాఖల వ్యవసాయ అనుబంధ జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు కూడా హాజరయ్యారు. ఈ ఎగ్జిబిషన్‌లో వ్యవసాయ పనిముట్లను ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వ విద్యాలయం నూతన ఆవిష్కరణలు చేశారు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి పసల్ బీమా యోజన, రైతు సాధికారిక సంస్థ, ప్రజా భాగస్వామ్య, ప్రకృతి వ్యవసాయం, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, నాగార్జునసాగర్ కుడి కాల్వప్రాజెక్టు కమిటీ చైర్మన్ పి.కాంతారావు స్టాల్స్‌ను సందర్శించి పరిశీలించారు.

పల్నాడు రైతాంగాన్ని ఆకట్టుకున్న పరికరాలు

వ్యవసాయరంగంలో ఆధునిక విధానాలపై వస్తున్న కొత్తకొత్త వ్యవసాయ పరికరాలను చూసేందుకు రైతులు పోటీపడ్డారు. డ్రోన్ సాయంతో పంటలపై పిచికారి చేయటం, తక్కువ నీటితో భూమిలో ఎక్కువకాలం తేమశాతం ఉండేలా పంటలు సాగు చేసేవిధానం రైతులను ప్రధానంగా ఆకర్షించాయి. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు రైతులు తెలుసుకున్నారు.

రైతులు ఆధునిక యంత్ర పరికరాలు ఉపయోగించుకోవాలి

స్టాల్స్ వద్ద గుమ్మికూడిన రైతులతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు మాట్లాడుతూ పంటలసాగు విధానంలో ఆధునిక పరికరాలు ఉపయోగించటంతో పాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొంద వచ్చునని సూచించారు. దాచేపల్లి, గురజాల, మాచవరం, పిడుగురాళ్ళ, రెంటచింతల మండలాలతో పాటు కారంపూడి, తెలంగాణా రాష్ట్రానికి చెందిన దామరచర్ల మండలాలకు చెందిన ఐదు నుంచి ఆరు వేలమంది రైతులు వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలివచ్చారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మంత్రి, ఎంపీలతో కలసి ఎడ్ల బండి నడుపుకుంటూ రైతుల వద్దకు రావటంతో రైతులు ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు.

రైతులకు ఎంతో మేలు చేసిన కిసాన్ మేళా

ఆధునిక వ్యవసాయరంగంలో ఆధునిక యంత్రాలు, పరికరాల పై అవగాహన కల్పించటంలో కిసాన్ మేళా ఎంతగానో ఉపయోగ పడిందని రైతులు వివరిస్తున్నారు. నడికూడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లను రైతుల్లో నూతన ఆలోచనలకు పురి గొల్పింది.

డ్రోన్‌తో పిచికారి మందు ఆకట్టుకుంది
నాగేశ్వరరావు నాయక్, పొందుగుల

డ్రోన్‌తో పంటలపై మందు పిచికారి చేసేవిధానం ఆకట్టుకుందని పొందుగుల గ్రామ పంచాయతీ శ్రీనివాసపురంకు చెందిన బొజ్జా కాశీవిశ్వనాథం వివరించాడు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.

యంత్రాలతో కలుపు తీసే విధానం బాగుంది
కోరె రామారావు, పెదగార్లపాడు

యంత్రాలతో పొలాల్లో కలుపులు, పిచ్చిమొక్కలు తొలగించేవిధానం బాగానచ్చింది. తక్కువనీటితో భూమిలో తేమశాతాన్ని నిల్వ ఉంచేవిధానం ఆకట్టుకుంది.


స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ లావు, పక్కన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్


నర్సరీలో పెరిగిన మొక్కలను పరిశీలిస్తున్న నేతలు

ఆధునిక యంత్ర పరికరాలపై సబ్సిడీ విధానం నచ్చింది
కాశీవిశ్వనాథం, శ్రీనివాసపురం

ఆధునిక యంత్ర పరికరాలపై సబ్సిడీ ఇచ్చే విధానం నచ్చింది. పత్తి, మిరప, నాణ్యమైన విత్తనాల లభ్యత పై అవగాహన కల్పించారు.


అచ్చంపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా కోటేశ్వరరావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పదవి ఒక బాధ్యత

అచ్చంపేట పీఏసీఎస్ అధ్యక్షుడు కోటేశ్వరరావు ప్రమాణ స్వీకార ఉత్సవంలో ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): పదవి అనేది ఒక బాధ్యతని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం స్థానిక పీఏసీఎస్ చైర్మన్‌గా కొప్పురావూరి కోటేశ్వరరావు, డైరెక్టర్లుగా ఎస్‌కే ఖాజావలి, కొరివి నరసింహారావుచే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని నూతన కార్యవర్గానికి సూచించారు. ఎక్కువమందికి రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అధ్యక్షత వహించారు. వెన్నా సాంబశివారెడ్డి, నూర్జహాన్ బేగం, కిలారి రాజన్‌బాబు, ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ, నందిగం ఆశీర్వాదం, మద్దిరాల గంగాధర్, పసుపులేటి పాపిరెడ్డి, నల్లమేకల వెంకటేశ్వర్లు, మొక్కపాటి గిరిబాబు, గంధం కోటేశ్వరరావు, చల్లా అనూపకళ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో సుపరిపాలన తొలి అడుగు

అచ్చంపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో గురువారం మధ్యాహ్నం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ముఖ్య అతిథిగా పాల్గొని మెయిన్ సెంటర్‌లో ఇల్లిల్లు తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలు, పాలన గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అనగానిని కలసిన కన్నా


మంత్రి అనగానితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెన పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం సచివాలయంలో రెవెన్యూ, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాదును కలిశారు. రెవెన్యూకు సంబంధించిన పలు అంశాలపై మంత్రితో చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

మంత్రి అచ్చెన్నను కలిసిన సత్తెనపల్లి యార్డు చైర్మన్ దంపతులు


మంత్రి అచ్చెన్నాయుడుని కలిసిన మార్కెట్ యార్డు చైర్మన్ శోభారాణి దంపతులు

సత్తెనపల్లి రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, మార్కెటింగ్ శాఖామంత్రి అచ్చెన్నాయుడును సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి, శ్రీనివాసరావు దంపతులు గురువారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కలిశారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డుకు నందమూరి తారకరామారావు వ్యవసాయమార్కెట్ యార్డుగా నామకరణం చేయాలని వారు మంత్రిని కోరారు. ఈ మేరకు యార్డు పాలకవర్గం చేసిన తీర్మానం కాపీని మంత్రికి అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

పిడుగురాళ్ళ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రెవెన్యూ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. రీసర్వే, విద్యార్థుల ధ్రువపత్రాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలుతో పాటు పీజీఆర్ సర్వేలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ తహసీల్దార్ మధుబాబుకు సూచించారు.

నేడు హోంమంత్రి, ఇన్‌ఛార్జ్ మంత్రి రాక

పెదకూరపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడులో ఈనెల 18వ తేదీ జరగనున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి హోంమంత్రి వంగలపూడి అనిత, విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రానున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి గురువారం తెలిపారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే భాష్యం గురువారం మండలంలోని కంభంపాడులో స్థల పరిశీలన చేశారు.

వాసవీ జాగృతి క్లబ్ అధ్యక్షుడిగా ఆదినారాయణ

కారంపూడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వాసవీ జాగృతి క్లబ్ అధ్యక్షునిగా కరాలపాటి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా కర్నాటి మహేష్, ట్రెజరర్‌గా ఆతుకూరి భాస్కర్‌ను గురువారం కారంపూడిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవీజాగృతి ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ భవిరిశెట్టి రామారావు, వాసవీ దేవస్థానం అధ్యక్షుడు మద్దు హనుమంతురావు, ప్రధానకార్యదర్శి కొత్తమాసు రామ్మోహనరావు, గౌరవాధ్యక్షుడు చీతిరాల వెంకటకోటేశ్వరరావు, నగరేశ్వరస్వామి ధర్మకర్త శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అమలుచేయండి..

నకరికల్లు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలుచేసి ఈ ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడికి రైతులకు ఊరట చెందేలా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కోరారు. గురువారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ఏడాది, ఈ ఏడాదికి సంబంధించిన రూ.40వేలు అన్నదాత సుఖీభవ పథకం నిధులను విడుదల చేయాలని కోరారు.

● పిడుగురాళ్ళ: పల్నాడులో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వాలు, పాలకులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. మిరపకు 5 వేలు, పత్తికి 3 వేలు, అపరాలకు 2 వేలు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు అన్నదాత సుఖీభవ పథకం డబ్బు విడుదలచేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌లో చదువుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర కో-ఆర్డినేటర్ రవీంద్రనాథ్ తెలిపారు. గురువారం క్రోసూరు హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వివరాలకు అధ్యయన కేంద్రం, ఎంఈవో కార్యాలయం, సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలయంలోగాని సంప్రదించాలన్నారు. ఆసక్తి గలవారు మీ సేవ, ఏపీ ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

బెల్లంకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. గురువారం బెల్లంకొండలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభు త్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతున్నాయంటే కూటమి ప్రభుత్వం కారణమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, సయ్యద్ జానీ, రాజక్, ఎస్ పిచ్చయ్య, సాగునీటి సంఘం చైర్మన్ ముస్తఫా, సుభానీ, సయ్యద్ మజీద్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

● మాచర్లటౌన్: గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనం దగ్ధం చేసిన సంఘటన మాచర్లలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పట్టణానికి చెందిన ముక్కా కనకరాజు పట్టణంలోని రింగు రోడ్డు సమీపంలో ప్రశాంతి రెస్టారెంట్ వెనుక బజార్లో పల్సర్ బైకును అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో పార్కుచేసి రూముకు వచ్చిన నిద్రించారు. సుమారు 3గంటల ప్రాంతంలో మంటలు వ్యాపించడంతో స్థానికులు వచ్చి చూడగా బైకు దగ్ధమవుతుంది. స్థానికులు నీళ్ల చల్లి మంటలను ఆర్పారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఎస్ఐ వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● బెల్లంకొండ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసిందేమి లేదని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చంద్రాజుపాలెం కల్యాణ మండలంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంకొండ మండలంలో వైసీపీ నాయకులు ప్రతి గ్రామంలో తిరిగి దీనిపై ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అన్నపరెడ్డి నర్సిరెడ్డి, ప్రసాదరెడ్డి, బద్దూరి చంద్రారెడ్డి, పాకాలపాటి మౌలాలి, బడేబచ్చ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● క్రోసూరు: రాష్ట్రంలో సుపరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, మండల టీడీపీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు దుద్దుల యోహాన్ అన్నారు. గురువారం క్రోసూరు యానాది కాలనీలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని వారు నిర్వహించారు.

● క్రోసూరు: ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో మండలంలోని పెరికపాడు గ్రామంలో పంట కాలువల నిర్మాణానికి రూ 10 లక్షలు నిధులు మంజూరైనట్లు టీడీపీ నాయకుడు జడ సుబ్బు తెలిపారు. గురువారం పంట కాలువ నిర్మాణానికి టీడీపీ నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊడల శ్రీధర్, టీడీపీ నాయకులు ఆవుల వినోద్, రాంబాబు, పొత్తూరి వసంతరావు, బయ్యవరపు సుబ్బారావు, నాగేశ్వర నాయక్, బ్రహ్మానందరావు, జనసేన పార్టీ నాయకులు బాజీ కిషోర్, సిద్ది రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి కృషి చేస్తా

రెంటచింతల, జూలై 17(ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమానికి, సకాలంలో ఎరువులు, ఇతర రుణాలందించడానికి కృషి చేస్తానని పాలువాయి సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అల్లం నాగలక్ష్మి హామీనిచ్చారు. గురువారం జీడీసీసీబీ మేనేజర్ కరుణబాబు నాగలక్ష్మి, ఇద్దరు డైరెక్టర్లు కాండానాయక్, పున్నయ్యల చేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కుర్రి శివారెడ్డి, శౌరిరెడ్డి నాగమ్మ, సర్పంచ్ మందలపు విజయలక్ష్మి, సీఈవో రాజసాగర్‌రెడ్డి, రామకృష్ణ, సహాయ మేనేజర్ నరసింహారావు, అంజిరెడ్డి పాల్గొన్నారు.


పాలువాయి సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అల్లం నాగలక్ష్మి

ఇది మేలు చేసే ప్రభుత్వం

● సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ళ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇది మేలు చేసే మంచి ప్రభుత్వమంటూ ప్రజల నుంచి కితాబు వస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని 11, 12 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వచ్చాక సాధించిన, పూర్తి చేసిన పథకాల గురించి వివరిస్తూ తల్లికి వందనం పథకం దేశంలోనే మంచి పథకమని, మహిళలందరి చేత భేష్ అంటూ వివినిపిస్తుందన్నారు. పట్టణంలోని ఇంటింటికి తాగునీరు అందించడంతోపాటు ప్రతి వావార్డుకు రూ. 15 లక్షల నిధులు కేటాయించామని, వాటితో మరిన్ని అభివృద్ధి పనులు త్వరలో చేపట్టబోతున్నామన్నారు. కార్యకర్తల సంక్షేమానికి మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని, పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల పట్టణాల అభివృద్ధికి రూ. 400 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, వాటితో అభివృద్ధి చేసేందుకు మరికొంత వీలు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, తురకా వీరస్వామి, వడ్డపల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, వడ్డపల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, ఎల్‌వీఆర్, వల్లెపు రామకృష్ణ కొండలు, సయ్యద్ అమీర్ అలి, మందా డేవిడ్, బొల్లా శ్రీను, పణితి రవి, కందిమళ్ల శ్రీను, బిజిలి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం

మాచర్లటౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని ఆర్యవైశ్య సంఘ నేతలు అన్నారు. అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారిలో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ అధ్యక్షుడు భవనాశి వెంకటేశ్వర్లు, వాసవీ క్లబ్ పాస్ట్ రీజనల్ చైర్మన్ మేడం నాగేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ జోనల్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, తిరివీధి వెంకటనాగేశ్వరరావు, తుమ్మెపల్లి సాంబశివరావు, బంగారు, చీదెళ్ల ఆంజనేయులు, గట్ల కోటిరెడ్డి, ఎల్ఐసీ నాగేశ్వరరావు, షరాబు వెంకటేశ్వర్లు, మేడం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

క్రోసూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారులు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో విత్తనాలు, ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. క్రోసూరులోని లక్ష్మీనరసింహ ఎంటర్ ప్రైజెస్ విత్తనాల షాపులో అనుమతి పత్రాలు లేనికారణంగా రూ.1,19,400 విలువైన విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. దొడ్లేరులో శ్రీనివాస ఫెర్టిలైజర్ గోడౌన్ పై దాడిచేసి 1.2 టన్నుల ఎరువులను అనుమతి పత్రాలు లేక సీజ్ చేశారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ సీఐ అపర్ణ మాట్లాడుతూ షాపుల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విత్తన పరీక్షా కేంద్రం ఏడీఏ నెల్లూరి కన్నయ్య, ఏవో ఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ముప్పాళ్ళ మండలంలో...

ముప్పాళ్ళ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో అంతర జిల్లా కమిటి, వ్యవసాయశాఖ అధికారుల బృందం తనిఖీ చేపట్టింది. రిజిష్టర్‌లో నమోదు చేయకుండా అమ్మకాలు జరుపుతున్న రూ. 35,400 విలువైన పురుగు మందుల అమ్మకాలు నిలిపివేస్తూ అధికారులు ఆదేశాలిచ్చారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన యర్రగుంట్ల


ఫణిదం పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న యర్రగుంట్ల వెంకటేశ్వర్లు

సత్తెనపల్లి రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిదం పీఏసీఎస్ చైర్మన్‌గా యర్రగుంట్ల వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌తోపాటు సభ్యులుగా కొర్నె శ్రీనివాసరావు, గంగవరపు నవీన్‌లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, ఎంపీ నర్సయ్య, ఆర్ సుధీర్, పెదకూరపాడు జీడీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ ఎం శ్రీనివాసరావు, సంఘ సీఈఓ ఆరాధ్యుల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పెదకూరపాడులో భారీ వర్షం


పెదకూరపాడు : లగడపాడు వద్ద రోడ్లపై ప్రవహిస్తున్న వాగు


సత్తెనపల్లి: గర్నెపూడిలో ఇంటిలోకి చేరిన వర్షపునీరు

పెదకూరపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనటంతో పొలాలు దున్ని.. వేసిన పత్తి విత్తనాలు మొలకెత్తక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాల్లో పొలాల్లో, రోడ్లపై, కాలువల్లో నీరు పారటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

● సత్తెనపల్లి రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండ, వేడిగాలులతో అల్లాడిన ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. వర్షాలు లేక వ్యవసాయ పనులు ప్రారంభం కాక ఇబ్బందులు పడ్డ రైతులకు వర్షం ఊపిరిపోసింది. గంటకుపైగా కురిసిన వర్షానికి పలు గ్రామాలలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గర్నెపూడిలోని ప్రధాన రహదారిలో ఉన్న పలు గృహాలతో పాటు ఎస్సీ కాలనీలోని పలు గృహాలలోకి వర్షపునీరు చేరింది. గృహాలలోకి చేరిన నీరు బయటకు పంపేందుకు ఆయా గృహాలవారు ఇబ్బందులు పడ్డారు.

సంక్షిప్తం...

● దాచేపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం కేశానుపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రిన్సిపాల్‌గా తోట అరుణ నియమితులయ్యా రు. ఇప్పటివరకు పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉన్న అరుణ ఇటీవల జరిగిన పరీక్షల్లో ఉత్తమమార్కులు సాధించి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు.

● మాచవరం: గ్రామాల్లో వర్షాలు పడుతున్న దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, మంచినీటి నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు శ్రద్ధ వహించాలని డిప్యూటీ ఎంపీడీవో వెంగళరావు ఆదేశించారు. గురువారం మండలంలోని చెన్నాయపాలెం, తురకపాలెం గ్రామాల్లో ఆయా అంశాలపై పర్యవేక్షించారు.

● మాచవరం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పల్నాడు జిల్లాలో మొదటి స్థానంలోను, రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచినట్లు వైద్యాధికారి ప్రసాదరావు గురువారం తెలిపారు. జూన్ నెలకు ఓపీలో 2500 టార్గెట్ ఉండగా 3158 నమోదయ్యాయన్నారు. అలాగే ఇన్‌పేషెంట్లు వంద మంది ఉండాల్సి ఉండగా 204 మందికి వైద్యసేవలు అందించామన్నారు. ల్యాబ్ టెస్టులు జూన్‌లో ఐదు వేలు చేయాల్సి ఉండగా 7784 మందికి నిర్వహించామన్నారు.

● ముప్పాళ్ళ: మత్తు పదార్థాల ను వినియోగించే వారి జీవితాలు నాశనం అవుతాయని.. వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్‌కుమార్ అన్నారు. మాదల హైస్కూల్‌లో గంజాయి, డ్రగ్స్ వాడకం వలన జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

● రాజుపాలెం: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని టీడీపీ మండల నాయకులు పులిబండ్ల సాంబశివరావు తెలిపారు. గురువారం రాజుపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వాణిజ్య విభాగం కార్యదర్శి పెద్దింటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ జెట్టి కోటేశ్వరరావు, బీసీ సెల్ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ లేబాకుల బ్రహ్మయ్య, సాగునీటి సంఘం అధ్యక్షుడు చొక్క శ్రీనివాసరావు, యామర్తి వెంకటరామయ్య, చొక్క వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

● సత్తెనపల్లి రూరల్: విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను మండలంలోని ఫణిదం గ్రామ టీడీపీ నాయకులు గురువారం తాడేపల్లిలోని మంత్రి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యుత్ సమస్యను మంత్రికి వారు వివరించారు. మంత్రిని కలసిన వారిలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, ఫణిదం పీఏసీఎస్ చైర్మన్ ఎర్రగుంట్ల వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకురాలు భీమినేని వందనాదేవి, కోటా ఖాళీదాసు, నిమ్మగడ్డ రత్తయ్య, శాఖమూరి కోటేశ్వరరావు, చింతా అశోక్, నిమ్మగడ్డ భాస్కర్ ఉన్నారు.

● మాచర్లటౌన్: దళితులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కులో దళిత బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యాన కారంచేడు మృతవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన బీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు పి.జార్జి, ఎంసీపీఐయూ డివిజన్ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, శ్రీవీరబ్రహ్మేంద్ర జాతీయ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు జి.అప్పారావు, కె.అన్నారావు, ఏ అచ్చయ్య, పి.రాజారావు, కె.శారమ్మ తదితరులు పాల్గొన్నారు.

● దుర్గి: మండలంలోని జంతువులకు ముద్దచర్మ వ్యాధి సోకిందని పశు సంరక్షణ వైద్యాధికారి దిలీప్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముద్దచర్మ వ్యాధి ఎద్దులు, ఆవులలో ఎక్కువగా ప్రబలిందన్నారు. ముద్దచర్మ వ్యాధి ఉంటే ఇంజక్షన్ చేయించాలన్నారు. దోమకాటు వలన ఈ వ్యాధి వస్తుందన్నారు. వివరాలకు సెల్: 9505477080లో సంప్రదించాలన్నారు.

● రెంటచింతల : రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన వైట్ బర్లీ పొగాకును కొనుగోలు చేయాలని రైతులు కోరారు. పొగాకు విక్రయించేందుకు వెళ్తే కొనేవారులేక తిరిగి ఇంటికి తెచ్చిన అన్నదాతలు పొగాకును తగులపెట్టి గోలి గ్రామంలో గురువారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. పొగాకు కొనుగోలు చేస్తామని రైతులకు బయ్యర్లు బాండ్లను ఇచ్చి ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని రైతులు ఆదిమళ్ల మణికంఠ, గోపాలరావు, శివశంకర్‌లు వాపోయారు.

● పల్లెసీమల ప్రగతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి అన్నారు. గురువారం మంచికల్లు గ్రామం ఎస్సీ కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సర్పంచ్ గొగుల పుల్లారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సొసైటీ చైర్మన్ యరపతినేని మట్టయ్య, మందలపు హనిమిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన స్పెషల్ కలెక్టర్ గాయత్రిదేవి రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో సమావేశమయ్యారు.

● కారంపూడి : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● గురజాలటౌన్: మండలంలోని తేలుకుట్ల గ్రామానికి చెందిన పాలువాయి కుసుమకుమారికి బీటెక్ చదువు కోసం అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత ఉన్నం నాగేశ్వరరావు రూ.50వేలను అందించారు. గురువారం నడికుడి మార్కెట్‌యార్డులో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదుగా అందించారు.

● గురజాల నగర పంచాయతీ పరిధిలోని సచివాలయాల్లో ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు కమిషనర్ శివన్నారాయణ తెలిపారు. ప్రజలు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. గురువారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

లాభసాటి సాగే లక్ష్యం

● ఆధునిక వ్యవసాయంతో రైతులకు ఆదాయం
● అన్నదాతలకు ఉపయోగ పడేలా కిసాన్ మేళాలు
● నడికూడి మార్కెట్ యార్డులో ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి



తక్కువ నీటితో పిచికారి విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి గొట్టిపాటి..

దాచేపల్లి, పిడుగురాళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి వ్యవసాయం లాభసాటి అనే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. దాచేపల్లి మండలంలోని నడికూడి మార్కెట్ యార్డులో గురువారం జరిగిన కిసాన్‌మేళాలో పాల్గొన్న మంత్రి ప్రసంగించారు. ఒక్క గురజాల రైతులకే పరిమితం కాకూడదని రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కిసాన్ మేళాలు నిర్వహించాలన్నారు. ఖర్చులు తగ్గించుకుని అధునాతన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు కిసాన్ మేళాలు ఉపయోగపడతాయన్నారు. ఒకప్పుడు వ్యవసాయంతో వచ్చే ఆదాయంతో పొలాలు కొనుగోలు చేసేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని నష్టాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సంక్షేమమే ధ్యేయంగా కాల్వల ఆధునికీకరణ, వ్యవసాయ యాంత్రిక పరికరాలను రాయితీతో రైతులకు అందిస్తుందన్నారు. మన దగ్గర పండే పంట ఉత్పత్తులను మన ప్రాంతంలోనే కాకుండా దేశం నలుమూలలా అందినప్పుడే రైతు లాభాల బాటలో ఉంటాడన్నారు. నల్లబర్లీ పొగాకు చివరి ఆకు వరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

వైసీపీ వాళ్లలా చేయొద్దు : ఎంపీ లావు



గతంలో వ్యవసాయ అధికారులు ఏదో మమ అనిపించేలా చేశారని, ఇప్పుడు అలా చేయకుండా ఏ పనిచేసినా రైతులకు ఉపయోగపడేలా చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. వారానికి మూడు నాలుగు సార్లు పురుగు మందుల వాడకాన్ని రైతులు తగ్గించాలన్నారు. విత్తన ఎంపిక నుంచి పంట అమ్ముకునే వరకు రైతులు పడుతున్న ఇబ్బందులను తగ్గించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. పంట పండించడం, ఆ పంటను విక్రయించుకోవడం మధ్య రైతులు ఎంతో నలిగిపోతున్నారన్నారు. కిసాన్ మేళాలను అమరావతి, నరసరావుపేట, వినుకొండ ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయాలన్నారు.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం: ఎమ్మెల్యే యరపతినేని



గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురైందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సాగు ఖర్చులు తగ్గించి అధిక లాభాలు పొందేలా కిసాన్ మేళాలు ఉపయోగపడతాయన్నారు. రైతులు బాగున్నప్పుడే దేశం, రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని తెచ్చిపెడుతుందన్నారు. చివరి భూములకు సాగునీరు అందించేందుకు మేజర్, మైనర్ కాల్వల ఆధునికీకరణ పనులు చేస్తున్నామన్నారు. రైతులు బాగుండాలి, ఖర్చులు తగ్గించుకోవాలి, ఉత్పత్తులు పెరగాలి.. అనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా సదస్సులు : కలెక్టర్ అరుణ్‌బాబు



వాతావరణాన్ని బట్టి సాగు చేసేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఆధునిక పద్ధతులతో ఖర్చులు తగ్గించుకునేలా రైతులకు సూచించాలన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు మాట్లాడుతూ పల్నాడులో వ్యవసాయంతోనే రైతుల జీవన విధానం ముడిపడి ఉందన్నారు. సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఖర్చులు తగ్గించి అధిక ఉత్పత్తులు సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో..
నేడు సీఎం చంద్రబాబు పర్యటన

● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

గుంటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో శుక్రవారం జరగనున్న గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ - 2025 ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహాతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. సీఎం కార్యక్రమ సభా స్థలి, సీటింగ్, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, మీడియా గ్యాలరీ ఏర్పాట్లను పరిశీలించారు. యూనివర్శిటీ 3వ అంతస్థులో రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమానికి సంబంధించి సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను సందర్శించారు. యూనివర్శిటీ అధికారులను సమన్వయం చేసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.నారాయణ రావు, ప్రో-వైస్ చాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్ అధికారులున్నారు. పాల్గొన్నారు.

నల్ల బర్లీ కొనుగోళ్లకు..
అదనపు సెంటర్ల పరిశీలన

గుంటూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా నల్లబర్లీ కొనుగోలు సెంటర్‌లు ఏర్పాటు చేసేందుకు గురువారం ఏపీ మార్క్‌ఫెడ్ గుంటూరు జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, పల్నాడు జిల్లా మేనేజర్ మురళీకృష్ణోర్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం సత్తెనపల్లి, నాదెండ్ల మండలం గణపవరం ప్రాంతాల్లో పర్యటించారు. సత్తెనపల్లి ఏఎంసీ, సీడబ్ల్యూసీ, నాదెండ్ల మండలం గణపవరం గ్రామ పరిధిలోని ప్రైవేటు గోదాములను పరిశీలించారు. సాధ్యమైనంత వరకు ఎక్కువ మంది రైతులకు రోజువారీ షెడ్యూలింగ్ చేసే అవకాశం కల్పించి, త్వరితగతిన కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ముగిసిన ఏఎన్‌యూ ఐసెట్

●19న ఫలితాలు విడుదల ● 21న ప్రవేశాలు

పెదకాకాని, జులై 17(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జనరల్ ఎంబీఏ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎంబీఏ హెచ్‌ఆర్‌ఎం కోర్సులలో సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరి సీట్ల భర్తీకి గురువారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష విజయవంతంగా ముగిసిందని ఏఎన్యూ పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీరావు గురువారం తెలిపారు. ప్రవేశ పరీక్షకు 119 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 100 మంది హాజరయ్యారని చెప్పారు. ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈ నెల 19న విడుదల చేస్తామని, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 21వ తేదీ నుంచి ప్రవేశాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రవేశాలకు వచ్చే విద్యార్థులు డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, మార్కుల జాబితాలు, టీసీతో పాటు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లతో విశ్వవిద్యాలయంలోని పీజీ ప్రవేశాల కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

23న ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష

ఏఎన్యూ ఇంజనీరింగ్ కళాశాలలో డ్యూయల్ డిగ్రీ విధానంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ కోర్సులలో సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరి సీట్ల భర్తీకి ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు 200కు పైగా దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరీ సీట్లలో ఆయా కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని విశ్వవిద్యాలయంలోని తమ కార్యాలయంలో నేరుగా సంప్రదించి పొందవచ్చన్నారు.

ముగిసిన జడ్పీటీసీ, ఎంపీపీల శిక్షణ

గుంటూరు సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజులు కొనసాగిన మహిళా జడ్పీటీసీ, ఎంపీపీ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. కార్యక్రమాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రారంభించారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళా ప్రజా ప్రతినిధుల పాత్ర, విధులు, బాధ్యతలు, గ్రామసభ, విధానాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం, నాయకత్వ ప్రభావం, కార్యాచరణ ప్రణాళిక అనే అంశాలపై శిక్షకులు ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. చివరి రోజు ప్రజాప్రతినిధులందరితో కలిసి జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా, జడ్పీ సీఈవో జ్యోతిబసు గ్రూప్ ఫోటో దిగారు. శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 560.70 అడుగులు ఉంది. ఇది 234.07 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1800 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 69,522 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 14.15 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 5,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం ఆరు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

కళతప్పుతోన్న కర్రసాము!

● ప్రాచీన యుద్ధ విద్యలపై యువత అనాసక్తి
● వయసు సడలుతున్నా.. కర్ర వదలని మాస్టారు వీరరాఘవులు
● ఎంతో మంది శిష్యులను తీర్చిదిద్దిన గురువు
● నేడు పండగలకు, పలు సందర్భాల్లో ప్రదర్శనలు
● మనుగడకు ప్రభుత్వ ప్రోత్సాహం కావాలంటూ విజ్ఞప్తి



సత్కారం పొందిన సాపా వీరరాఘవులు

(ఆంధ్రజ్యోతి, చిలకలూరిపేట): కర్ర సాము, కత్తి సాము ప్రాచీన సాంప్రదాయ క్రీడలు. పాత సినిమాల్లో ఎన్టీఆర్, కాంతారావు, రాజనాల వంటి సినీ నటులు కర్రలు, కత్తులతో ఫైటింగ్ చేస్తుంటే సినీ ప్రేక్షకుల చప్పట్లు, ఈలలతో థియేటర్లు దద్దరిల్లేవి. కాలక్రమంలో ఈ క్రీడలు అంతరించిపోతున్నాయి. ప్రత్యేక సందర్భాలు, పండుగల వేళ కర్రసాము, కత్తిసాము ప్రదర్శనలతో సాధన చేసిన కొద్దిమంది ఈ కళ అంతరించిపోకుండా కంటికి రెప్పలా కాపాడుకొస్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 400 మంది కర్రసాము చేసేవారు. ఇప్పుడు అతి కొద్దిమంది మాత్రమే మిగిలి ఉన్నారు. శిక్షణ ఇచ్చే గురువులు లేకపోగా.. శిక్షణ పొందడానికి ముందుకు వచ్చే యువకులు కూడా కనిపించడం లేదు. పదేళ్ల క్రితం వరకు చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌లో వీరాంజనేయ మల్లయుద్ధ వ్యాయామ శాల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో రెండుమూడు రోజులపాటు కర్రసాము పోటీలు జరిగేవి. బాణాకర్ర, ఒంటి చెడి కర్ర, రెండు చెడి కర్రల విభాగాల్లో పోటీలు నిర్వహించేవారు. పది జానలు, ఐదు జానలు, నాలుగు జానల కర్రలతో పోటీల్లో పాల్గొనేవారు. మొదట్లో రంగులు పూసి.. కర్రసాము ద్వారా ఎదుటి వ్యక్తి శరీరానికి రంగు అంటుకున్న దానిని బట్టి పోటీల్లో పాయింట్లు ఇచ్చేవారు.

75 ఏళ్ల వయసులోనూ..

తన దివంగత గురువులు బిరుదు సుబ్బయ్య, సూరం నాగభూషణం, చల్లా వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఇప్పటికీ దసరా పండగ రోజు 75 ఏళ్ల సాపా వీరరాఘవులు చిలకలూరిపేట కళా మందిర్ సెంటర్‌లో ప్రదర్శన ఇస్తున్నారు. ప్రతి ఉగాదికి ఇక్కడి కావమ్మతల్లి గుడి వద్ద కర్రసాము, కత్తిసాము ప్రదర్శనలు ఇస్తూ.. దశాబ్దాల తరబడి వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. కర్రలు, కత్తులతో పలు రకాల విన్యాసాలు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. కత్తిసాములో వాడే ఇనుప, ఇత్తడి కత్తి, డాలు, ఈటె, జింక కొమ్ములు వంటి వస్తువులను కాజా మొహిద్దీన్, పలువురు గురువుల నుంచి ఆయన సేకరించారు. ఆదరణ కోల్పోతున్న ఈ క్రీడలను కాపాడేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.



కర్రసాము వీరరాఘవులు

చిలకలూరిపేట చెందిన సాపా వీరరాఘవులు కర్రసాము, కత్తిసాములో ఎంతో ప్రావీణ్యం సాధించారు. కర్రసాము, కత్తిసాము మాస్టారుగా పేరుపొందారు. రాష్ట్రస్థాయి కర్రసాము పోటీలకు ఆయన న్యాయ నిర్ణేతగా వ్యవహరించేవారు. ఆయన గతంలో బాపట్ల, దుగ్గిరాల, రాజమండ్రి, చిలకలూరిపేటలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచారు. ఆసక్తి గల వారికి కర్రసాములో శిక్షణ ఇచ్చేవారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కర్రసాము సాధన చేసేవారు. చిలకలూరిపేటకు చెందిన పేరుబోయిన వెంకటేశ్వర్లు, సుంకర హరిబాబు, అమీర్‌బాబు, లూథర్, సాప ఆదినారాయణ, వేల్పుల శివరామకృష్ణ ఆయన దగ్గర శిక్షణ పొందారు. వీరంతా పండుగ రోజుల్లో పలు చోట్ల ప్రదర్శనలు ఇచ్చేవారు. వ్యక్తిగతంగా, బృందాలుగా ఈ ప్రదర్శనలు కొనసాగుతుండేవి.



కర్ర సాము, కత్తి సాము ప్రదర్శనలో పాల్గొన్న ప్రముఖులు

సాగరం ఘుమ ఘుమలు



చేపలను శుభ్రం చేస్తున్న మహిళ

ఆలోచన ఉంటే ఉపాధి కొదవ లేదు. తెలిసిన పనిని తెలివిగా మలుచుకుంటే ఆదాయం అదే తెచ్చిపెడుతుంది. కానీ, దానికి 'సమయం' రావాలి. ఆ పర్యాటక సమయాన్నే.. ఉపాధిగా మలుచుకుంటున్నారు.. విజయపురిసౌత్ మత్స్యకారులు. నాగార్జున సాగర్‌కు వచ్చే పర్యాటకులకు మీనా ముక్కలకు మసాలాలు దట్టించి, సలసల కాగే నూనెలో వేయించి అందిస్తున్నారు. రోడ్డు పక్కనే చిన్న చిన్న గుడిసెలు వేసుకుని.. పెద్ద పెట్టుబడి లేకుండా..జీవనోపాధి పొందుతున్నారు. ఒక్క చేపల ఫ్రై మాత్రమే కాదు.. వేడి వేడి అన్నంలోకి చేపల పులుసు.. ఎవరైనా.. ఆర్డర్ ఇస్తే చేపల ఊరగాయలు కూడా అందిస్తున్నారు.

● పర్యాటకులకు..పసందైన చేప వంటకాలు
● స్థానిక మత్స్యకారులకు ఆదాయ మార్గం
● చేపల ఫ్రై..పులుసు.. ఆర్డర్ ఇస్తే ఊరగాయ
● ఉన్న ఊర్లోనే ఉపాధి.. రోడ్డు పక్కనే దుకాణం

మాచర్ల టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం నాగార్జున సాగర్ విజయపురి సౌత్ మత్స్యకారులకు చేపల వేటే జీవనాధారం. అయితే చేపలు పట్టి విక్రయించడమే కాదు.. వాటిని వేయించి వేడివేడిగా పర్యాటకులకు అందిస్తూ ఆదాయం పొందుతున్నారు. ఇలా ఒక కుటుంబం నుంచి మొదలైన ఈ చిరు వ్యాపారం.. నేడు 50 కుటుంబాలకు చేరింది. నాగార్జున సాగర్‌కు వచ్చే పర్యాటకులకు అప్పటికప్పుడు వేడి వేడిగా ఫిష్ ఫ్రై, ఫిష్ కర్రీ అందిస్తున్నారు. ముందుగా ఆర్డర్ ఇస్తే చేప పచ్చళ్లు కూడా తయారు చేసి సప్లయి చేస్తున్నారు. నాగార్జున సాగర్ పై జంక్షన్ నుంచి మొదలుపెట్టు కొని నూతన బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా చిన్న పాకలు ఏర్పాటు చేసుకున్నారు. మత్స్యకార మహిళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫిష్ ఫ్రైలు అందిస్తూ.. అన్ని ఖర్చులు పోనూ రోజూ రూ. 600 నుంచి రూ. 1000 దాకా ఆదాయం గడిస్తున్నారు.

ఫ్రైకు వాడే చేపలు

నల్ల బొచ్చలు, రవ్వలు, పాంప్లెట్లు వంటి చేపలను ప్రధానంగా ఫ్రై చేసి అందిస్తున్నారు. కళ్ల ముందే ఫ్రెష్‌గా చేపలను చూపించి అప్పటికప్పుడు శుభ్రపరిచి కార్న్ పౌడర్, కారం, ఉప్పు, తగినంత గరం మసాలా దట్టించి బాండీలో సలసలలాడే మంచి నూనెలో ఫిష్ ముక్కలు వేయించి ఇస్తున్నారు. సుదూర ప్రాంతాల పర్యాటకులు, హైదరాబాద్ వెళ్లే వారు.. ఇక్కడ రోడ్డు పక్కన వాహనాలు నిలుపుకొని ఓ చేప ముక్క రుచి చూసి వెళ్తుంటారు. మరికొంత మంది మహిళలు చేప పులుసు, వైట్ రైస్ అందుబాటులో ఉంచి వినియోగదారులకు అందిస్తున్నారు. ఇలా మత్స్యకార కుటుంబాలు స్థానికంగానే ఉపాధిని పొందుతున్నాయి.



బాండీలో చేపలను ఫ్రై చేస్తున్న మహిళ

సాగర్‌కు పర్యాటకుల తాకిడి..

ఎగువ రాష్ట్రాల్లో కృష్ణా నదికి వరద నీరు చేరి దిగువకు శ్రీశైలం, నాగార్జున సాగర్ వరద ప్రవహిస్తున్నప్పుడు క్రస్ట్ గేట్లు ద్వారా నీటి విడుదల చేస్తారు. ఇలాంటి సమయాల్లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. మత్స్యకార కుటుంబాలకు ఈ సమయమే.. ఎక్కువగా వ్యాపారం సాగుతుంది. జూలై, ఆగస్టు, సెప్టెంబరులో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది.



రోడ్డు పక్కన పాకను ఏర్పాటు చేసి..

తిరుపతి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ధర్మవరానికి పొడిగింపు



గుంటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నెమలిపురి, రొంపిచర్ల నూతన రైలు మార్గంలో ప్రవేశపెట్టిన నాందేడ్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు ఒకటో తేదీ నుంచి ధర్మవరం వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1, 8, 15, 22, 29(శుక్రవారం) తేదీల్లో 07189- నాందేడ్ - ధర్మవరం ప్రత్యేక రైలు సాయంత్రం 4.30కి బయలుదేరి అర్ధరాత్రి 12.03కి నడికుడి, 12.28కి పిడుగురాళ్ల, 12.58కి నెమలిపురి, 1.23కు రొంపిచర్ల, 1.58కి వినుకొండ, శనివారం వేకువమజామున 5.30కి నంద్యాల, మధ్యాహ్నం 12 గంటలకు తిరుపతి, సాయంత్రం 5.30కి ధర్మవరం చేరుకొంటుంది. 07190 ధర్మవరం - నాందేడ్ ప్రత్యేక రైలు ఆగస్టు 3, 10, 17, 24, 31(ఆదివారం) తేదీల్లో వేకువజామున 5.30కి బయలుదేరి ఉదయం 10.20కి తిరుపతి, సాయంత్రం 4.10కి నంద్యాల, రాత్రి 7.28కి వినుకొండ, 8.03కి రొంపిచర్ల, 8.28కి నెమలిపురి, 8.58కి పిడుగురాళ్ల, 9.28కి నడికుడి, 11.48కి చర్లపల్లి, సోమవారం వేకువజామున 5.18కి బాసర, ఉదయం 8.30కి నాందేడ్ చేరుకొంటుంది.

హైదరాబాద్ - కొల్లం - హైదరాబాద్ ప్రత్యేక రైళ్లు

07193 హైదరాబాద్ - కొల్లం ప్రత్యేక రైలు ఆగస్టు 16 నుంచి అక్టోబరు 11వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 11.10కి బయలుదేరి 11.30కి సికింద్రాబాద్, ఆదివారం రాత్రి 2.59కి నడికుడి, 3.43కి పిడుగురాళ్ల, 4.33కి సత్తెనపల్లి, 5.30కి గుంటూరు, మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి.. సోమవారం వేకువజామున 4.09కి చెంగనూరు, ఉదయం 7.10కి కొల్లాం చేరుకొంటుంది. 07194 కొల్లాం - హైదరాబాద్ ప్రత్యేక రైలు ఆగస్టు 18 నుంచి అక్టోబరు 13వ తేదీ వరకు ప్రతి సోమవారం ఉదయం 10.45కి బయలుదేరి 11.48కి చెంగనూరు, అర్ధరాత్రి 2.55కి తిరుపతి, మంగళవారం ఉదయం 10.40కి గుంటూరు, 11.33కి సత్తెనపల్లి, 11.53కి పిడుగురాళ్ల, మధ్యాహ్నం 12.19కి నడికుడి, 3.55కి సికింద్రాబాద్, సాయంత్రం 5.30కి హైదరాబాద్ చేరుకొంటుంది.

కన్యాకుమారి - హైదరాబాద్ - కన్యాకుమారి ప్రత్యేక రైలు సర్వీసులు

07239 కన్యాకుమారి - హైదరాబాద్ ప్రత్యేక రైలు ఆగస్టు 15 నుంచి అక్టోబరు 10వ తేదీ వరకు ప్రతి శుక్రవారం వేకువజామున 5.15కి బయలుదేరి మధురై, కొడైకెనాల్ రోడ్డు, తంజావూరు, కుంభకోణం, చిదంబరం, తిరువణ్ణామలై మీదగా రాత్రి 10.10కి తిరుపతి, శనివారం వేకువజామున 5.50కి గుంటూరు, ఉదయం 7 గంటలకు సత్తెనపల్లి, 8 గంటలకు నడికుడి, మధ్యాహ్నం 1.05కి సికింద్రాబాద్, 2.30కి హైదరాబాద్ చేరుకొంటుంది. 07230 హైదరాబాద్ - కన్యాకుమారి ప్రత్యేక రైలు ఆగస్టు 13 నుంచి అక్టోబరు 8వ తేదీ వరకు ప్రతీ బుధవారం సాయంత్రం 5.20కి బయలుదేరి 5.45కి సికింద్రాబాద్, రాత్రి 9.19కి నడికుడి, 9.59కి సత్తెనపల్లి, 11 గంటలకు గుంటూరు, గురువారం ఉదయం 7.30కి తిరుపతి, మధ్యాహ్నం 12.40కి తిరువణ్ణామలై, రాత్రి 9.45కి మధురై, అర్ధరాత్రి దాటాక 2.30కి కన్యాకుమారి చేరుకొంటుంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బాల్య వివాహం అడ్డగింత

నరసరావుపేట లీగల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలగడ్డలో ఐసీడీఎస్ అధికారులు ఓ బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. ఓ బాలికకు వివాహం చేస్తున్నారని స్థానికులు 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేశారు. దీంతో ఐసీడీఎస్ సిబ్బంది శైలజ, వీఆర్వో రవి, సూపర్‌వైజర్ పార్వతి ఘటనాస్థలికి చేరుకుని బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఐక్యతతోనే గ్రామాల్లో ప్రశాంతత: ఎస్ఐ

నాదెండ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలు ఐక్యతతో మెలిగితేనే గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయని నాదెండ్ల ఎస్ఐ జీ పుల్లారావు అన్నారు. మండలంలోని గొరిజవోలులో జరిగిన పల్లె నిద్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొడ్డురాయి సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు ఘర్షణలు పడవద్దని సూచించారు. సమస్యలువస్తే పెద్ద మనుషుల మధ్య పరిష్కరించుకోవాలని, లేకుంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయటమే లక్ష్యం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయటమే లక్ష్యం అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివాపురం, కొత్తపాలెం గ్రామాల్లో బుధవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పారదర్శక పాలన, ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికి సుపరిపాలన ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, దీనిలో భాగంగానే ఇంటింటికి ప్రచారం చేపట్టడం జరుగుతుందన్నారు. పాఠశాలకు వెళ్లే రహదారి లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, హైవేలో జరిగే ప్రమాదాల్లో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

నేడు ప్రజాదర్బార్

వినుకొండ నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. సమస్యలు నేరుగా చీఫ్‌విప్ జీవీని కలిసి వివరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు

అర్హత ఉండి అవకాశం కోసం ఎదురుచూస్తున్న వారంతా ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. నియోజకవర్గం మొత్తంలో ఎవరు ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు కావాలన్నా వెంటనే గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి నేరుగా దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరిక

శావల్యాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని వయ్యకల్లు, బొందిలిపాలెం, కొత్తలూరు గ్రామ పంచాయతీలకు కొత్తగా ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు గురువారం విధులలో చేరినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. వయ్యకల్లు పంచాయతీ కార్యదర్శిగా ధర్మరాజు, బొందిలిపాలెం పంచాయతీ కార్యదర్శిగా అరుణ భారతి, కొత్తలూరు పంచాయతీ కార్యదర్శిగా వెంకట్రావులు బాధ్యతలను స్వీకరించినట్లు తెలిపారు. వీరు ఫిరంగిపురం మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై శావల్యాపురం మండలానికి వచ్చినట్లు తెలిపారు.

బోయపాలెం సీఎస్‌సీకి ద్వితీయ స్థానం

యడ్లపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యడ్లపాడు గ్రామ పరిధిలోని బోయపాలెంలో నిర్వహిస్తున్న శ్రీ సాయి గణేష్ కామన్ సర్వీస్ సెంటర్‌కు ద్వితీయ స్థానం దక్కింది. సీఎస్‌సీ దివస్ వేడుకలు 2025లో భాగంగా ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. గ్రామ స్థాయిలో 4.24 లక్షల కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో కేవలం 20మందికి మాత్రమే ఈ అవార్డు లభించింది. సీఎస్‌సీ నిర్వాహకుడు వంకాయలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డెపల్లి నరసింహారావు ఈ అవార్డును అందుకున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

విద్యార్థులు అదనపు నైపుణ్యాలు నేర్చుకోవాలి: భగవాన్‌దాస్

వినుకొండ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువజన కేంద్రం గుంటూరు సహకారంతో నేచులర్ హెల్త్‌కేర్ సెక్రటరీ ఎన్.భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో ప్రపంచ యువ స్కిల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు అదనపు స్కిల్స్ కూడా నేర్చుకోవాలని, అందులో భాగంగా కంప్యూటర్ పరిజ్ఞానం, చిత్రలేఖనం, ఏఐ, స్పోర్ట్స్ మొదలైనవి నేర్చుకోవాలన్నారు. ఇవి వారి భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు గజవల్లి సుబ్బయ్య, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో తనిఖీలు

బొల్లాపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మండలంలోని పరమేశ్వర వైన్స్, గణేష్ వైన్స్, వెంకటేశ్వర వైన్స్ తదితర మద్యం దుకాణాలను గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రతిరోజు ఎక్స్ఛేంజ్ ఐ యాప్ ద్వారా సిబ్బందికి విధులు కేటాయించి మద్యం దుకాణాల మీద నిఘా ఉంచటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హార్ట్స్ రక్తదాన శిబిరం

వినుకొండ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని పెద్ద మసీదు సెంటర్‌లో హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 100మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు.

రొంపిచర్లలో అధికారుల తనిఖీ

రొంపిచర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలోని జీడీసీఎంఎస్ గోడౌన్, ధరణి ఏజెన్సీల్లో అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏలూరు జిల్లా కోట రామచంద్రాపురం ఏడీఏ బుజ్జిబాబు, విజయవాడ విజిలెన్స్ సీఐ మహమ్మద్ ఉమర్, ఏవోలు సుబ్బారెడ్డి, శివ లలితలు పాల్గొన్నారు. స్టాక్ రిపోర్టులను పరిశీలించారు. స్టాక్ వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. గోడౌన్‌లో బస్తాలకు, రిజిస్టర్‌లో ఉన్న ఎరువుల బస్తాలకు, ఈ పోస్‌లో ఉన్న ఎరువుల బస్తాలకు తేడా లేకుండా చూడాలన్నారు.

వాతావరణ సూచికలకు రక్షణ కరువు

వినుకొండ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలోని మార్పులను సూచించే పరికరాలను పరిరక్షించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. వినుకొండ తహసీల్దార్ కార్యాలయంలోని రెయిన్‌పాల్‌తో పాటు కార్యాలయం వెనుక ఉన్న టెంపరేచర్ పరికరాలకు రక్షణలేకుండా ఉంది. కార్యాలయం ముందున్న వానను కొలిచే పరికరం చుట్టూ సరైన రక్షణ గోడలు లేకపోవడంతో ఆ ప్రాంతంలో సంచరించే ఆవులు, శునకాలకు ఆవాస కేంద్రంగా మారాయి. ఇదిలా ఉండగా టెంపరేచర్ పరికరానికి గత సంవత్సర కాలంగా రక్షణవాల్‌తో పాటు టెంపరేచర్‌ను చూపించే మిషన్‌కు చెట్లు అల్లుకుపోయి నిరుపయోగంగా పడిఉన్నాయి. ఎండను, వర్షపాత సూచిక యంత్రాల రక్షణ లేక అవి ఎలాపనిచేస్తాయని ప్రశ్నిస్తున్నారు. ఈ పరికరాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏఎస్‌వో కోటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.




రక్షణ లేకుండా ఉన్న రెయిన్‌పాల్ యంత్రం, చెట్లతో అల్లుకుపోయిన టెంపరేచర్ పరికరం

పీ4ను సామాజిక ఉద్యమంగా రూపొందాలి

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పీ4 పథకం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా సామాజిక ఉద్యమంగా రూపొందాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం నరసరావుపేట మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) పీ4 కార్యక్రమంపై సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పీ4 పథకం ద్వారా నరసరావుపేట నియోజకవర్గంలో పేదరికాన్ని నిర్మూలించే దిశగా పనిచేయాలన్నారు. పేద కుటుంబాలను దత్తత తీసుకొని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి సమాజంలోని స్థితిమంతులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారవేత్తలు ముందుకు రావాలన్నారు. ఆర్డీవో ఎం మధులత మాట్లాడుతూ పేద కుటుంబాల గుర్తింపు, వారి అవసరాల మదింపు, సహాయం అందించే ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చదలవాడ, పక్కన ఆర్డీవో మధులత, తహసీల్దార్ వేణుగోపాలరావు తదితరులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నరసరావుపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి రూ.24 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లబ్దిదారులు, అధికారులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని వరవకట్టలో మసీదు నిర్మాణాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం పరిశీలించారు. మసీదు నిర్మాణం గతంలో వివాదాస్పదంగా మారి, నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మసీదు నిర్మాణ పురోగతిని పరిశీలించారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ మసీదు నిర్మాణం పూర్తికి స్థానికులందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి మెగా వైద్యశిబిరం

వినుకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో డాక్టర్ అంజిరెడ్డి హాస్పటల్ నరసరావుపేట వారు ఈఎస్ఐ ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంప్‌లో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్, ప్రజా ఆరోగ్య విభాగం (పారిశుధ్య కార్మికులు), ఇంజనీరింగ్ సిబ్బందికి ఉచిత ఓపీతో పాటు బీపీ, షుగర్, గుండె పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి సతీమణి షకీలా బేగం, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

సమావేశానికి ప్రజాప్రతినిధులు డుమ్మా

వినుకొండ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పగడాల జయశ్రీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంపై ఎంపీడీవో పుట్టారెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులతో పాటు మండల స్థాయి అధికారులు కూడా మొక్కుబడిగా హాజరై కిందిస్థాయి సిబ్బందిని సమావేశానికి పంపడంపై కొందరు అధికారులు విస్మయానికి గురయ్యారు. కేవలం ఒకరిద్దరు మండలస్థాయి అధికారులు మాత్రమే పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని 26 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు కార్యాలయం ముఖం చూసిన దాఖలాలు లేవు. కేవలం ఏడెమినిది ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీఎం రామాంజనేయులు మాట్లాడుతూ వెలుగు పథకం ద్వారా 10వ తరగతి చదువుతున్న పిల్లలకు పావలా వడ్డీకే రూ.లక్ష రుణాలు అందించడం జరుగుతుందన్నారు. ఏనుగుపాలెం వైద్యాధికారి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డుకు బదులు పీఎంజేపై కార్డులు వచ్చాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ మండలంలోని కొత్తపాలెం, భారతాపురం, విఠంరాజుపల్లి, పెరుమాళ్లపల్లి గ్రామాలకు ఆర్వోప్లాంట్లు మంజూరయ్యాయని, కేవలం రూ.2లక్షల వ్యయంతో రూమ్‌ల నిర్మాణం చేపట్టినట్లయితే మరో రూ.8లక్షలతో బాలవికాస్ సంస్థ సహకారంతో ప్లాంట్‌లు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ బెల్లం శివ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయశ్రీ

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: జీకే

రొంపిచర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని రొంపిచర్ల పడమటిపాలెంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● ఈపూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని ఈపూరు సొసైటీ డైరక్టర్ అయినాల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొచ్చెర్లలో గురువారం సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరి శాంతారావు, గోనుగుంట్ల శరభయ్య, పోకా వెంకట్రావు, దేవబత్తుల చెంచయ్య, తూమాటి రామకోటేశ్వరరావు, తొగటి అంకారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నూజెండ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల మండల డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్.సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా నుంచి పదోన్నతిపై నూజెండ్ల మండలానికి వచ్చారు.

● వినుకొండటౌన్ మండలంలో పెదకంచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు వినుకొండకు చెందిన వైద్యుడు సాయిప్రేమ్ రూ.5000 రూపాయలు విలువచేసే డైరీలను హెచ్‌ఎం శ్రీరామ్ నాయక్‌కు అందజేశారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పట్టణం రెడ్డి నగర్‌లోని డ్రైవర్ కిలారు మల్లికార్జునరావు పండించే మిద్దె తోటను నారాయణ ఈ టెక్నో ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు గురువారం సందర్శించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ భాషా ఏజీఎం లక్ష్మణరెడ్డి, కోఆర్డినేటర్ ఎస్.భద్రారెడ్డి, ఎస్‌కే గౌస్, డీన్ డీ అనిల్, ఎవో కే.సోమశేఖర్‌రావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: హెచ్‌ఐవీతో జీవించే వారికి మెరుగైన సేవలు అందించడం ద్వారా హెచ్‌ఐవీ నివారణ చేయవచ్చని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.మంజుల గురువారం తెలిపారు. జూమ్ మీటింగ్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లా మెడికల్ అండ్ హెల్త్, ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో పనిచేస్తున్న ఐసీటీసీ కేంద్రాలు, ఏఆర్‌టీ సెంటర్లు, స్వచ్ఛంద సంస్థలతో రివ్యూ మీటింగ్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జానీభాష, జిల్లా సూపర్‌వైజర్ జె.వీరాస్వామి, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ రత్నకుమార్, ఏఆర్‌టీ సెంటర్లు మెడికల్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: నియోజకవర్గంలో ఇప్పటివరకు 242పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 34 కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు 1,200మంది కంటే ఎక్కువమంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజించి కొత్తగా అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. పట్టణంలో 27పోలింగ్ కేంద్రాలు, చిలకలూరిపేట రూరల్ మండలం పరిధిలో 4, నాదెండ్ల మండలం పరిధిలో 3 పోలింగ్ కేంద్రాలు నూతనంగా ఏర్పాటు చేయనున్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు గురించి గురువారం చర్చ జరిగింది.

ఇక్కుర్రు సొసైటీ చైర్‌పర్సన్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకారం

నరసరావుపేట రూరల్, జూలై 17: (ఆంధ్రజ్యోతి) ఇక్కుర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్‌గా కొల్లి వెంకటేశ్వర్లు, చెరుకూరి కావేరి, కుంభ పోలయ్యలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా అఫీషియల్ పర్సన్ ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహించిన డి.రవికుమార్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొడ్డపాటి పేరయ్య కూరపాటి శ్రీనివాసరావు, కె.రమేష్, ఎన్.గిరిధర్, ఉడతా రాఘవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



నూతన చైర్‌పర్సన్ కొల్లి వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న రైతులు

సుబ్బయ్యపాలెం సొసైటీ చైర్‌పర్సన్‌గా ఇంటూరి

రొంపిచర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బయ్యపాలెం సొసైటీ చైర్‌పర్సన్‌గా ఇంటూరి వెంకటప్రసాదు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో కొల్లి బ్రహ్మయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, కార్యదర్శి జి.సురేష్, పి.జగ్గయ్య, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తిపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తిపై గురువారం పట్టణంలోని పీఎన్‌సీ కళాశాలలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రెండో పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెండవ పట్టణ సీఐ ఎం.హైమారావు మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. విద్యార్థినులు మహిళలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా గృహహింసకు సంబంధించి 181, అత్యవసర సేవలకు సంబంధించి 112, మహిళల వేధింపులు అక్రమ రవాణాకు సంబంధించి 1091, పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించి 1098, సైబర్ నేరాలకు సంబంధించి 1930, గంజాయి మత్తు పదార్థాల నివారణకు సంబంధించి 1972 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. మహిళల సాధికారతకు ఉన్న చట్టాలను వివరించారు. ర్యాగింగ్ నివారణ, మాదక ద్రవ్య వినియోగ నివారణ, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు హరిబాబు, లేఖప్రియాంక, కళాశాల నిర్వాహకులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందించటమే లక్ష్యం

● ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ షేక్ మీరావలి

నరసరావుపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించటమే తమ లక్ష్యం అని చైర్మన్ షేక్ మీరావలి అన్నారు. గురువారం ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల డిప్లొమో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ షేక్ మీరావలి మాట్లాడుతూ విద్యార్థులకు వందశాతం ప్లేస్‌మెంట్ కల్పిస్తామన్నారు. మొదటి ఏడాదిలో ఉత్తీర్ణులైన బ్రాంచ్ మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు నగదు బహుమతి అందజేసి సత్కరించారు. సీఎస్‌ఈలో 82 శాతంతో జబీన్, ఈసీఈలో 80 శాతంతో ముక్తియర్, మెకానికల్‌లో 78శాతంతో మణికుమార్‌లు మొదటి ర్యాంక్‌లు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, విద్యార్థుల, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాల విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలి: ఎస్టీయూ

చిలకలూరిపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు పొజిషన్ ఐడీ రాక జూన్ నెల జీతాలు ఇంకా జమ కాలేదని, జీతాలు సమస్య వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు గురువారం ఇక్కడ జరిగిన సమావేశంలో డిమాండ్ చేశారు. బదిలీలకు సంబంధించి ఆర్థికశాఖ అనుమతితో పొజిషన్ ఐడీ క్రియేట్ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

అవినీతి, అక్రమాల పుట్ట ఎమ్మెల్యే ప్రత్తిపాటి

● మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావుపై మాజీమంత్రి విడదల రజిని గురువారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో రజిని ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ ఎమ్మెల్యే పుల్లారావు అవినీతి అక్రమాలు తారాస్థాయికి చేరాయన్నారు. నియోజకవర్గంలో గ్రావెల్ తవ్వకాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, పేకాట, రేషన్ బియ్యం ఎమ్మెల్యే కనుసనల్లో విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఆరోపించారు. కూటమి పార్టీకి చెందిన వారే అక్రమగ్రావెల్ రవాణాను అడ్డుకున్న విషయం అందరికీ తెలిసిన విషయమేనన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తాను చిలకలూరిపేట ఆసుపత్రిని వంద పడకలకు పెంచి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.10కోట్ల నిధులు మంజూరు చేయిస్తే దానిని ఆయన ఖాతాలో వేసుకున్నారన్నారు. చిలకలూరిపేట బైపాస్ రోడ్డు విషయంలో రైతులకు నష్టపరిహారం ఇప్పించి, రోడ్డు నిర్మాణం జగన్ ప్రభుత్వ హయాంలో పూర్తయితే అదంతా తానే చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్ళినా తన పేరు జపించకపోతే ఎమ్మెల్యేకు నిద్ర పట్టడం లేదని విమర్శించారు. తమ బహిరంగ సభ కోసం ఫ్లెక్సీలు ముద్రించిన ఫ్లెక్సీ దుకాణం యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం న్యాయమేనా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ అంతా బూటకమని అన్నారు. ఈసారి వచ్చేది జగన్ ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గజ్జల భార్గవ్ రెడ్డి, నాగార్జున యాదవ్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని